# ఊరు గోదారి

## అద్దేపల్లి ప్రభు

ఇంకా తెల్లారకముందే గోదారి గట్టుకి పోడం అలవాటు మణికంఠకి. అప్పటికి వూళ్లింకా లెగవు. గోదారి కూడా లెగదు. సన్నటి శ్వాసలాంటి అలల శబ్దం- చంటిపాప స్పర్శలాంటి నీటి తడీ మణికంఠకి ఇష్టం. బొమ్మలు వేయడం ఇంకా రాని పాప కాగితమ్మీది పెన్సిల్ చీకటిని ఎరేజర్‌తో తుడుస్తున్నట్టు వెలుగు బయటపడుతూ ఉంటుంది. గట్టుమీద అలా కూర్చుంటాడు మణికంఠ. వేప్పుల్ల నవిలేసి దాన్ని చీల్చి నాలిగ్గీసుకుని రేవులోకి దిగుతాడు. గోదావరి అతని ఒంటిని పునుకుతూ తగుల్తుంది. అది గోరువెచ్చకాదు- అట్లని చల్లనాకాదు. అది స్పర్శ. వొట్టి నీళ్ళూ కాదు... తడీ కాదు. అది ఏదో స్పర్శ. మనిషి శరీరంలోని ద్రవాన్ని- ఈ బయటి ద్రవం ఆప్యాయతతో తడిమే స్పర్శ. అవును... ఆ రెండూ ఒకటే.

ప్రొద్దుటి గోదారి గాలి అతని వూపిరిలోకి సూర్య పరిమళాన్ని తీసుకెళ్తుంది. చెట్లూ... మొక్కలు... గడ్డీ... చిత్తడీ... నాచూ... అన్నీ కలగలిసిన ఒక ఉద్రేకంలాంటి గాలి పరిమళం అతని కళ్లలోకి సూర్యుణ్ణి ప్రతిబింబిస్తుంది. గుండెల వరకూ నీటిలో దిగి తలవొంచి నోటిని నీటి తలంపైన ఆన్చి లోనకి పీల్చుకుంటాడు. ఈతడు కొడతాడు.

కలకలా తెల్లారిపోతుంది. తన పనుల్లోకి పోతాడు మణికంఠ.

మళ్లీ పొద్దోయాకా... నారింజ గోదారి మీద పక్షులు నల్లగా అగుపించే సమయాన వస్తాడు. అలసిన గోదారిని మునివేళ్లతో పలకరిస్తాడు. మూతితో ముద్దాడి కితకితలు పెడతాడు. కానీ గోదారి ఉల్లాసమవదు. 'ఉండు... మణికంఠా...' అన్నట్టు ఉంటుంది. ఆ నీళ్లు గోరువెచ్చగానో... చల్లగానో... ఉంటాయి తప్ప తాకినట్టు ఉండవు. నిశ్శబ్దంగా బయటకొచ్చేస్తాడు మణికంఠ. గట్టుమీద కూర్చుని గోదారి నిద్రలోకి పోవడం చూస్తాడు. తన యింటికి పోతాడు.

'వాడికి గోదారి భాష తెలుసు' అంటుంది వాళ్ల అమ్మమ్మ.

'ఒక్క గోదారి భాష తెలుసు' అంటుంది వాళ్ల అమ్మమ్మ.

**కథ**

'ఒక్క గోదారి భాషేటి.. ఆడు పూర్వ కాలంలోని గంధర్వుడి లాటోడు. ఆడికన్ని భాషలూ వస్తాయి' అని కూడా ముక్తాయిస్తుంది.

వంటపాకలో సంజెవేళ పుల్లల పొయిమీద చట్టిలో చేతిపరిగెలు వొండుతూ అమ్మమ్మ మణికంఠ గురించి చెప్తా ఉంటుంది. వాడి అమ్మ చెల్లిపోయాకా వాడి నాన్న ఇంకో పెళ్లి చేసుకుని రాయమందిరం ఎల్లిపోయాకా వీడి భారం తనమీదే పడింది. చంటి కుర్రాణ్ని ఇన్నాళ్లూ ఎలా పెంచిందో తనకే తెల్దు. తనకేటున్నాయి? పొలాలా పుట్రలా? కూలి పని తప్ప దిక్కులేదు. ఏదో... ఆ పేరంటాళ్లమ్మ తల్లి దయవల్ల ఈడు పెద్దయ్యాడు. కూలీ నాలీ చేసుకుంటున్నాడు. అంతకన్నా యింకేటి కావాలి?

వెండి జడ పాయల తలలోంచి కారిన చెమటతో ఆమె నుదుటన కుంకుమ తడిసి జారి ముక్కుమీదికి పాకుతుంది. మణికంఠ పొయి ముందు కూర్చుంటూ "తానం సేసి రాయే అమ్మమ్మా! తెక్కట్టపడి పోతన్నావ్..." అంటాడు. అని ఉడుకుతున్న కూరలోంచి చేపని తీసి గుటుక్కున మింగేస్తాడు. "అబ్బ... బలే వర్ర గుందే..." అంటాడు ఆర్చుకుంటూ.

పొద్దోయాకా నులక మంచం వాల్చుకుని తాతయ్య పడుకునుంటే కాళ్లు పడతాడు. ఆ పక్కనే అలికిన మట్టి అరుగు మీద చాపేసుకుని వేపచెట్టుని చూస్తూ కలల్లోకి పోతాడు.

నేరేడు పండు మిసిమి యువ రాకుమార్తె రామదుర్గం టంకసాలని చూస్కొని కోటకెళ్లడానికి గోదారి గట్టుకొచ్చింది. రాత్రేళ రహస్యం! ఎవురికీ తెలకూడదు. పైగా ఆవిడ మారేసంలో ఉంది. గోదారి దాటాల. డింగీ మీద కూర్చొని వెళ్తుంటే తిరగబడిపోయింది. ఈత రాదు. మునిగిపోతోంది. అప్పుడు నీట్లోకి దుంకాడు మణికంఠ. రాకుమార్తెని రక్షించి ఒడ్డుకి చేర్చాడు. రాజు ఆయన పరివారమంతా మణికంఠని గొప్పగా పొగిడారు. ఇంత సాహసం చేసినందుకు గోదారి మెచ్చి మణికంఠని వరం కోరుకోమంది. మణికంఠ ఆలోచిస్తున్నాడు.

ఇంతలో రాజు "తల్లీ ఈ కొండలమధ్య ఆనకట్ట కడతాం. నీళ్లని మైళ్లకి మైళ్లు తీసుకుపోతాం... కరెంటు తీస్తాం... పొలాలు పండిస్తాం... ఫ్యాక్టరీలు నడుపుతాం... నీళ్లన్నీ వృథా కాకుండా వాడుకుంటాం... ఈ వరమియ్యి తల్లీ!" అన్నాడు.

చందమామలా పైకి లేచిన గోదారి నీటి బిందువు కిందపడి బద్దలైపోయింది.

ఆ నీళ్లు చెళ్లున చరిచినట్టయ్యి లేచాడు మణికంఠ.

రోజులాంటి వేళే. అమ్మమ్మ బుస వినిపిస్తోంది. వేపచెట్టు మీద గుడ్లగూబ ఎలకల కోసం వెదుకుతోంది. 'యియ్యాల ఈ కలేటి?' అనుకున్నాడు మణికంఠ. 'ఆ రాకుమారి ముఖం ఒక్కసారీ కనపళ్లేదు' అనుకున్నాడు. 'ఈ రాజు గోడెవడ్రా... పీకపిసికి సంపుతాను గానీ కాస్త





వోర్చుకో' అంటాడు' అనుకున్నాడు. 'కానీ... తను ఎంటనే ఏటీ కోరనే లేదేటబ్బా...' అనుకున్నాడు.

ఒక దట్టమైన పొగలా పాకి... వూరంతా కమ్మి ఉక్కిరిబిక్కిరి చేసింది ఆ మాట. గోదారి మీద ఆనకట్ట కడతారట... వూళ్ళకి ఊళ్ళు మునిగిపోతాయట... మనూరు కూడా మునిగిపోద్ది... కాబట్టి ఊరిడిసిపోవాల్ట!

"ఏడికి పోతాం...ఆల్లలగే అంటారు" అని మూతితిప్పింది అమ్మమ్మ.

పొలాలున్నవాళ్ళకి డబ్బులిస్తున్నారనీ... ఇళ్ళున్నవాళ్ళకి డబ్బులిస్తున్నారనీ... తక్కిమా వాళ్ళకి ఇంకా ఏమీ ఇవ్వరనీ ఏవేవో అనుకుంటున్నారు.

"ఎవలేటనుకుంటేటి? మనం ఊరిడిసి పోయేదీ లేదు... గోదార్నిడిసీ పొయ్యేది లేదు కదా" అంది అమ్మమ్మ చేటలో గంట్లు పిచ్చుకలకి వేస్తూ... పిచ్చుకలు గరగల్లా వెనక్కి ముందుకీ అడుగులేస్తూ తలని తిప్పుకుంటూ ఏరుకుంటున్నాయి.

"చాలా పెద్ద ఆనకట్టంటే అమ్మమ్మా... మనూరే కాదు... ఆ కనపడే కొండలూ...కొండెనక మన్నెంకూడా మునిగిపోద్దట" అన్నాడు మణికంఠ.

"మరి... నరమానవులూ... పశుపక్షాదులు... చెట్టూ, పుట్టలూ ఏటవుతాయట".

"గోదాట్లో కలుత్తాయంట..." పకపకా నవ్వాడు.

అమ్మమ్మ చేట పక్కన పెట్టి గుప్పెడు గింజల్ని కోళ్ళకి జల్లుతూ...

"మరైతే గోదారెందట్ల కలుత్తాదంట?" అంది. తల్లి కోడిచుట్టూ కిస్ కిస్ మంటూ పిల్లకోళ్ళు చేరాయి. చిటుకూ చిటుకూ గింజల్ని ఏరుకుంటున్నాయి.

"గోదారి సంద్రంలో కలాల. అప్పుడే బూపెపంచికం సల్లంగుంటది. ఇసుంట రమ్మంటే ఇల్లంతా ఆవరించినట్టు గట్టుని బతకరా నరుడా అంటే మట్టుపెట్టి కానీ కదల్నంటే ఎట్టా" అంది.

తెల్లారి గోదారొడ్డున మణికంఠని ఎత్తుగా... బలంగా ఉన్న మనిషి ఒకడు ఆపేసి "ఇటు రాకూడదు ఫో..." అన్నాడు.

మణికంఠ తెల్లబోయి "అసలు నువ్వెవరివి" అన్నాడు.

"నేను సెక్యూరిటీ గార్డుని" అన్నాడు.

అతనొక్కడే కాదు ఇంకా పది మందున్నారు.

"తానం చెయ్యాల... ఊరు ఊరంతా ఈడికే వస్తది. మా వూరు గోదారి... యిలా రాకూడదంటానికి మీరెవరు?"

"వురేయ్..ఇది గవర్నమెంటార్డర్..గవర్నమెంటు రావద్దంటే.. రాకూడదంతే... చాలా అయ్యగారూ ఇవరాలు... ఎల్లెల్లు... ఇంకో సిటవున్నవంటే కాళ్ళిరగ్గొట్టి పోలీసుల కప్పచెప్తా" అంటూ నవ్వాడు వెటకారంగా.

అందరూ పకపకమన్నారు. ఊరోల్లు వచ్చి తెల్లబోతున్నారు.

తెల్లారాకా సర్పంచితోనీ... ఊరి పెద్దలతోనీ కాంట్రాక్టరు.. పోలీసులు మాట్లాడారు. పోలీసాఫీసరు అన్నాడు "గోదారి మీయమ్మా బాబుల సొత్తు కాదు. అది గవర్నమెంటుది. గవర్నమెంటు దాన్ని అమ్మేస్తుంది. వొడ్డు పొడుగునా గోడలు కడుతుంది. దానిష్టం వచ్చినట్టు చేస్తది. అడగడానికి మీకే హక్కూ లేదు. అయినా అసలు మీ వూరే ఉండదు... ఈ ఏరియానే ఉండదు... పోండి... ఊరిడిసిపోయి ఇంకోచోటు వెదుక్కోండి... కాదని అల్లరిచేసినా... గోదారి దగ్గరకొచ్చినా మర్యాద దక్కదు..." అని అరిచాడు.

ఊరు ఉండదు. ఊరు... సచ్చిపోద్దా.

ఊళ్ళకి ఊళ్ళు సచ్చిపోతాయా...

మనుషుల్ని పురుగుల్లా చెల్లాచెదురు చేసేస్తే...

ఊళ్ళు సచ్చిపోతే... ఏ రాక్షసుడు వీటిని పుక్కిట పట్టబోతాడు.

మణికంఠ దూరంగా కనిపిస్తున్న గోదార్ని చూస్తూ ఏడుస్తున్నాడు.

అమ్ముంటుంది... నాన్నుంటాడు... ఊరుంటుంది. గోదారుంటుంది.

ఊరుండదు... గోదారుండదు... ఇంకేటి ఉండేది?

గోపి వచ్చి మణికంఠని 'ఏడకరా... ఈల్లు మన్ని ఆపగ్రలేటి' అని గొంతునొక్కుకుని 'కాస్తంత సీకటడ్డాకా అల్లా రేవుకాడికి పోదాం. అక్కడ పోలీసులు ఉండరు" అన్నాడు చూపుడు వేలితో దూరంగా చూపుతూ.

సీకటడ్డాక పోలీసుల్లేని చోట రేవులోకి దిగారు ఇద్దరూ... మణికంఠ తేటగా ఉన్న నీటి దగ్గరకి పోయాడు.

గోదారి గజగజలాడుతున్నట్టుంది. కొంచెం మునిగి గుక్కెడు నీళ్ళు మింగాడు. నోరంతా చేదెక్కినట్టనిపించింది. మెల్లిగా ఒడ్డుకి నడిచాడు.

"అమ్మమ్మా... మన గోదారికి మనం దొంగల్లా వెళ్లాల్సి వత్తందే... మన నేల మీద మనం దొంగలమైపోయామే... ఎవడితో ఏం మాట్టాడితే ఏటొత్తదో అని బయమేత్తందే... లోకమిట్టా మారిపోయిందేటే..." అని వలవలా ఏడిచాడు.

"పెద్ద పెద్ద వరదలు రెండింటిని చూసాను నేను" అని మొదలుపెట్టింది అమ్మమ్మ. "ఊళ్ళకి ఊళ్ళు మునిగి పోయినై. గోదారి పూనకమొచ్చిన ఆడపడుచులా చిందులు తొక్కడం చూసాను. ఇప్పుడు నువు తానం చేసేచోట ఒసారి గండి పడుద్దని అక్కడ బత్తాలేసారు. అయినా వరద ఆగింది కాదు. అప్పుడు మా యక్క పూలూ కొబ్బరికాయలూ పట్టుకెళ్లి 'శాంతించు తల్లీ' అని పూజ చేసి కొబ్బరికాయలు కొట్టింది. నువు తానంచేసే చోటే- యింతలో గోదారి పిలిచింది... ఇదెల్లిపోయింది. గంటలో వరద తగ్గిపోయింది. మా యక్క ఊరికి దేవతై వెలిసింది. మనూరి కోసం... మన జనం కోసం బలైతే ఊరికి దేవతై వెలుస్తాం. ఎవడి కోసం బలౌతామో కూడా తెలకపోతే బలయ్యాకా మన పేర్ల దీపం పెట్టే దిక్కు కూడా ఉండదు. దీన్ని బలన్రా... కుక్క సావంటారు..." అని ఆగింది.

మణికంఠ బుగ్గల మీద నీరు చారికలు కట్టింది. అతడు 'చెప్పు... చెప్పు' అన్నాడు. అమ్మమ్మ వాడికి మెటికలు విరిచి...

"మన గోదారికీ... మన ఊరికీ... మన నేలకీ... మన గాలికీ... మన పశుపక్షాదులకీ... మన చెట్టూ పుట్టా కొండా కోనలకీ మనవెప్పుడూ దొంగలం కామురా... ఎవడో ఒక ఎదవ కర్రుచ్చుకు నిలవడితే ఆడిదైపోతుందా అది? ఒకదాన్ని మనం రక్షించాలంటే దాన్ని మనం ఇష్టపడాలి. మన ఇష్టం పెరిగేకొద్దీ దాని శక్తి పెరుగుతుంది. మనలాంటివాళ్ళు వేలూ... లచ్చలూ... కోట్లూ అయితే... అది మహాశక్తి గల దేవత అవుతుంది. ఆ దేవతే మన్ని కాచుకుంటుంది".

ఒక రాగంలా ఆమె మాట మణికంఠని కమ్మేసింది.

అతడు గోదారిని మరింత ఇష్టపడ్డాడు.

ఆ ఇష్టాన్ని అందరికీ ప్రచారం చేయడం మొదలుపెట్టాడు.